వ్యవసాయ కూలీలకు రూ. 12 వేలు ఇవ్వాలి

- ఈజీఎస్‌లో పని దినాలను కొలమానంగా తీసుకోవద్దు
- అర్హులందరికీ పథకం వర్తింపజేయాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు శారద

మాట్లాడుతున్న శారద

చెన్నారావుపేట, డిసెంబర్ 29: భూమి లేని ప్రతి వ్యవసాయ కూలీకి రూ. 12 వేలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మొగులోజు శారద డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏటా రూ. 12 వేలు ఇస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. అర్హులైన కూలీలందరినీ గ్రామ సభల ద్వారా గుర్తించి పథకం వర్తింపజేయాలని కోరారు. ఉపాధి హామీలో పని దినాలను కొలమానం చేసి పథకం వర్తింపజేయాలనడం దుర్మార్గమన్నారు. ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పని పూర్తి చేసిన వారికి మాత్రమే ఈ పథకం ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఈజీఎస్ పథకం అమల్లో అనేక లోపాలు ఉన్నాయని తెలిపారు. పనిదినాలను కొలమానంగా తీసుకుంటే చాలా మందికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేవారు. గ్రామసభల ద్వారా మాత్రమే లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏ నరేశ, కే చంద్రకళ, నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పోచమ్మమైదాన్/గీసుగొండ, డిసెంబర్ 29: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. వరంగల్ 12వ డివిజన్‌లోని సెకండ్ డాక్టర్స్ కాలనీలో బాలాజీ వెల్ఫేర్ సొసైటీ, శ్రీవరద వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ వారు ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కార్పొరేటర్ కావటి కవితా రాజు యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ చార్లినా, కాలనీ కమిటీ అధ్యక్షుడు శ్రీరాం చందర్, గౌరవ అధ్యక్షుడు రమణ, కార్యదర్శి సింగిరికొండ సంతోష్, కోశాధికారి జనార్దన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సింగిరికొండ సురేశ్, కార్యదర్శి కిషన్‌రావు, కోశాధికారి సోమనాథం, అసోసియేషన్ అధ్యక్షుడు గణపతి సమ్మయ్య పాల్గొన్నారు. అలాగే, గీసుగొండ మండలంలోని మరియపురంలో వ్యాపార వేత్త అల్లం బాలకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి మందులు అందించారు. నాయకులు వీరగోని రాజ్‌కుమార్, మహేందర్, రాజు, అల్లం మర్రెరెడ్డి, డాక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'బతుకు తండ్లాట' కవితా సంపుటి ఆవిష్కరణ

కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 29: యువ కవి, గాయకుడు కార్తీక రాజు తన కవిత్వంలో బతుకు తండ్లాటను స్పష్టంగా చెప్పారని తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు పొట్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. తెరసం వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండ ప్రాక్టీసింగ్ స్కూల్‌లో యువ కవి కార్తీక రాజు రచించిన 'అలికిడి' కవితా సంపుటిని ఆదివారం ఆవిష్కరించారు. ప్రముఖ కవి బిల్ల మహేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బతుకు తండ్లాట కవితా సంపుటి చాలా బాగుందన్నారు. ఆచార్య బన్న ఐలయ్య మాట్లాడుతూ అస్తిత్వవాద స్పృహ, చారిత్రక దృక్పథం, మహిళలపై గౌరవం, బాల్య జ్ఞాపికలతో నిరంతరంగా కవిత్వంలో కార్తీక రాజు పలవరిస్తున్నాడని చెపారు. ప్రముఖ కవి నెల్లుట్ల రమాదేవి మాట్లాడుతూ కవి తన చుట్టూ ఉన్న సమాజంలోని వైరుధ్యాలు, ఆవేదన, సంఘటనలను చూసి చలించి, జ్వలించి, కవితాక్షరమైనాడని కొనియాడారు. కార్యక్రమంలో కవయిత్రి గట్టు రాధిక, డాక్టర్ చింతం ప్రవీణ్‌కుమార్, బీవీఎన్ స్వామి, తాడిచెర్ల రవి, దేశిని శ్రీధర్, చంద్రరావు, నాగవెల్లి జితేందర్, మందని శంకర్, అనంతోజు మోహనకృష్ణ, పల్లేరు వీరస్వామి, రామ రత్నమాల, కవి అన్వర్, అస్నాల శ్రీను, నిధి, దేవుపల్లి వాణి, పాము భాస్కర్, సోమయ్య, అంజనీదేవి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

★80% బ్యాంకు లోన్‌తో వరంగల్ హైవే ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ DTCP అప్రూవ్డ్ ప్లాట్స్, కంప్లీట్ CC రోడ్స్, ఎలక్ట్రిసిటీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, వాటర్ ట్యాంక్‌తో. సంప్ర: 8109994456.
NT-326623

LOSTS DOCUMENTS
My name is Narravula Kiran S/o Venkateshwarlu, R/o Incherupally, Venkatapur Mandal, Mulugu District. I lost my land Regd. Documents Gift Deed No. 5095/2016 While Travelling from Kesamudram (Stn.) to Korukondapally on my bike, so if found Please let me know Contact Number: 9705403712

WANTED
jobs Apply Now!
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

చారిత్రక సంపదకు నిప్పు!

- బూడిదవుతున్న రాతికోట
- కేంద్రపురావస్తు శాఖ నిర్లక్ష్యం

నిప్పు పెట్టడంతో మసకబారి పగిలిన రాతికోట పశ్చిమ ద్వారం మెట్లు

ఖిలావరంగల్, డిసెంబర్ 29: అపూర్వ పరిపాలనా దక్షత.. అద్వితీయ కళాపిపాస కలిగిన కాకతీయల చరిత్రకు సజీవ సాక్ష్యం ఓరుగల్లు ఖిల్లా. కాకతీయ చక్రవర్తుల పౌరుషానికి ప్రతీకగా నిలిచిన శత్రుదుర్భేద్యమైన కోటలు, కట్టడాలు, శిల్పసంపద మసక బారుతున్నది. చారిత్రక సంపదను సంరక్షించి భావితరాలకు అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర పురావస్తు శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఫలితంగా ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన రాతికోట కాలగర్భంలో కలిసిపోతున్నది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కొంత ముష్కరుల దండయాత్రలో ధ్వంసం కాగా, మిగిలిన సంపదను కాపాడడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శిస్తున్నారు. రాతికోటను శుభ్రం చేసేందుకు ఆ శాఖకు చెందిన సిబ్బంది ముళ్ల పొదలను తొలగించి చారిత్రక కట్టడాల మధ్య డంప్ చేస్తున్నారు. ఆనక అవి ఎండిన తర్వాత వాటికి నిప్పు పెడుతున్నారు. దీంతో ఘనమైన రాతికోట బండరాళ్లు మంటలకు పగిలి కళావిహీనంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు చెత్తను కాల్చి కోట రాళ్లను ధ్వంసం చేశారు. ఆ ఘటనలు మరువకముందే మరోసారి రాతికోట పశ్చిమ ద్వారం వద్ద ముళ్ల పొదలను తొలగించి నిప్పు పెట్టడంతో కోట మెట్లు పగిలి మసకబారిపోతున్నాయి. చారిత్రక కట్టడాలను ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ధ్వంసం చేసిన వారిపై కేంద్ర పురావస్తుశాఖ చట్టం ప్రకారం కఠినంగా వ్యవహరించాల్సి ఉంది. అయితే, కేంద్ర పురావస్తు శాఖ అధికారులే ధ్వంసం చేస్తుండడంపై పర్యాటకులు ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కురుమలు అన్ని రంగాల్లో రాణించాలి

గిర్నాజీపేట, డిసెంబర్ 29: కురుమ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని జగిత్యాల సివిల్ కోర్టు జడ్జి కంచ ప్రసాద్ అన్నారు. చార్‌బౌళీలోని బ్లూబెల్స్ హైస్కూల్‌లో ఆదివారం వరంగల్ కురుమల పెళ్లిపందిరి ఆధ్వర్యంలో నిర్వహించిన దీపావళి పురస్కారాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రసాద్ హాజరై మాట్లాడారు. అనంతరం దీపావళి పురస్కార గ్రహీతలైన కురుమ కులస్తులకు అవార్డులు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, కన్వీనర్లు మండల నరసింహారాములు, ముదిగిరి ఓదెలు, అన్నరాజు, ముదిగిరి సమ్మయ్య, కంచ సంపత్, దండు కృష్ణ, సాగర్, మండల సీతారాములు, నరిగె శ్రీను, చిగిరి కుమారస్వామి, దయ్యాల సుధాకర్, గుండ ఎలేశ్, రవి పాల్గొన్నారు.

స్థలం పత్రాలు అందజేస్తున్న లింగయ్య

గ్రామ పంచాయతీకి విరాళంగా స్థలం

ఖానాపురం, డిసెంబర్ 29: మంగళవారిపేట గ్రామ పంచాయతీకి చెన్నబోయిన లింగయ్య జడ్పీహెచ్ఎస్ పక్కనే ఉన్న గుంట స్థలాన్ని విరాళంగా అందజేశారు. భూమికి సంబంధించిన పత్రాలను కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం కారోబార్ ఐలుమల్లుకు గ్రామ పెద్దల సమక్షంలో అందించారు. కార్యక్రమంలో సతీశ్, నవీన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేటి బల్దియా గ్రీవెన్స్ రద్దు

వరంగల్, డిసెంబర్ 29: గ్రేటర్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగే గ్రీవెన్స్‌ను పరిపాలనా పరమైన కారణాలతో రద్దు చేసినట్లు కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేటర్ ప్రజలు గమనించి వినతులు, ఫిర్యాదులు ఇచ్చేందుకు కార్యాలయానికి రావొద్దని సూచించారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

వర్ధన్నపేట, డిసెంబర్ 29: మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో వర్ధన్నపేట పోలీసులు ఆన్‌లైన్ మోసాలపై ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. సెకండ్ ఎస్సై మేరుగు రాజు మాట్లాడుతూ మోసపూరిత ఫోన్ సంభాషణలు, మేసేజ్‌లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు జరిగితే వెంటనే 1930, 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

అంబర్ ప్యాకెట్ల పట్టివేత

దుగ్గొండి, డిసెంబర్ 29: మండలంలో రూ. 69 వేల విలువైన గుట్కా, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు. తిమ్మంపేటలో కొలిపాక మధు(32) నిర్వహిస్తున్న రాజరాజేశ్వర కిరాణా షాపులో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 9 వేల విలువైన గుట్కా ప్యాకెట్లు, గిర్నిబావిలో కొట్టురి రమేశ్(50) కిరాణా షాపులో రూ. 60 వేల విలువైన అంబర్ ప్యాకెట్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

టీజీఆర్ఎస్ఏ జిల్లా అడహక్ కమిటీ

నర్సంపేట, డిసెంబర్ 29: తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) జిల్లా అడహక్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండల పరిషత్ ఎలక్షన్ డీటీ అడ్లూరి రాజేశ్వర్‌రావు, ట్రెజరర్‌గా నర్సంపేట మండల తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఐత సాయికృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్

గీసుగొండ, డిసెంబర్ 29: తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని మచ్చాపురం గ్రామానికి చెందిన కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొమ్మాల గ్రామానికి చెందిన గడ్డమీది రమేశ్‌ను నియమించినట్లు హైదరాబాద్‌లోని గౌడ సంఘం కార్యాలయంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. తమ ఎన్నికకు సహకరించిన జిల్లా, రాష్ట్ర నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరుకాపు వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక

కరీమాబాద్, డిసెంబర్ 29: తెలంగాణ మున్నూరుకాపు వెల్ఫేర్ సొసైటీ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నూతన కమిటీని 41వ డివిజన్ విశ్వనాథకాలనీలో ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి పెంచాల నర్సయ్య తెలిపారు. అధ్యక్షుడిగా సాంబరాజు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా గై సదానందం, సిరిపోరు వినిల్, ప్రధాన కార్యదర్శిగా గొంగల్ల సాంబయ్య, సహాయ కార్యదర్శిగా బొల్లం రాజ్‌కుమార్, కోశాధికారిగా రావుల రంగారావు, సహాయ కోశాధికారిగా బల్కజే రాజేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


రాయపర్తి: ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

పాఠశాలల్లో 'అపూర్వ' సమ్మేళనం

రాయపర్తి/దుగ్గొండి, డిసెంబర్ 29: రాయపర్తి మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ 1997-98 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు, దుగ్గొండి మండలం నాచినపల్లి జడ్పీహెచ్ఎస్ 1985-86 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆయా పాఠశాలల్లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని సందడి చేశారు. తాము చదువుకున్న తరగతి గదులు, బ్లాక్ బోర్డులు, క్రీడా మైదానం, ల్యాబ్‌లు, గ్రంథాలయాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. నాడు చేసి అల్లరి, కొంటె పనులను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు.

దుగ్గొండి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా కృషి చేయాలి

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 29: సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా సభ్యులు కృషి చేసినప్పుడే గమ్యాన్ని చేరుకుంటామని, ఐక్యతతోనే జాతి మనుగడ ముడిపడి ఉందని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా శ్రీకామాక్షీ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహిళా సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం హనుమకొండలో నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు గుగ్గిళ్ల శశిరేఖ అధ్యక్షతన, ప్రధాన సలహాదారులు, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణ మాచార్యులు సమన్వయంతో నిర్వహించిన సమావేశంలో సిరికొండ మధుసూదనాచారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత కాలంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సమాజం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నదన్నారు. జాతి ఔన్నత్యాన్ని నిలబెట్టడమే పరమావధిగా రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం కృషి చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, హైకోర్టు న్యాయవాది పెందోట శ్రీనివాస్, మహిళా సంఘం అధ్యక్షురాలు చిలుకూరి లక్ష్మీ రామాచారి, కోశాధికారి దంతోజు యశోద, అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రుద్రోజు భవానీ, కోశాధికారి నీలోజు అరుణ, సహాయ కార్యదర్శి పెందోట రమాదేవి, ఉపాధ్యక్షులు చెంగెల్లి హేమలత, కర్ణకంటి భారతి, కొత్తగట్టు మనోహర, దుద్దుకూరి పుష్పలీల, కొక్కొండ అమల, కార్యదర్శులు వంగల కల్పన, మడుపు మంజుల, మట్టెవాడ ఉమా మహేశ్వరి, కార్యవర్గ సభ్యులు కజాంపురం అశ్విని, చిలుకూరి రజిని, గుంటోజు పావని, శ్రీరామోజు నాగరాణి, మహారాజ సుజాత పాల్గొన్నారు.

మద్యం అమ్మి ఖజానా నింపుకుంటున్న ప్రభుత్వం

సీనియర్ సిటిజన్ క్లబ్ మండల ప్రధాన కార్యదర్శి సాంబయ్య

చెన్నారావుపేట, డిసెంబర్ 29: మద్యం అమ్మకాలు పెంచి రాష్ట్ర ప్రభుత్వం ఖజానా నింపుకోవాలని చూస్తున్నదని సీనియర్ సిటిజన్ క్లబ్ మండల ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య అన్నారు. ఆదివారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడుతూ ఆంగ్ల నూతన సంవత్సర ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మద్యంపై అత్యధిక రాబడిని రాబట్టి ఖజానా నింపేందుకు ఎక్సైజ్ శాఖను వాడుతున్నదని విమర్శించారు. 31న బార్లు, వైన్స్‌లకు అర్ధరాత్రి వరకు అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. కేవలం రెండు రోజుల్లో రూ. వెయ్యి కోట్ల తెలంగాణ ప్రజల సొమ్మును ప్రభుత్వం కొల్లగొట్టాలని చూస్తున్నదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సుమారు 60 వేల బెల్ట్ షాపుల్లో యథేచ్ఛగా అమ్మకాలు సాగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు బెల్ట్ షాపుల తాట తీస్తానని గొప్పలు చెప్పుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు బెల్ట్ షాపుల ఆదాయంపై ఆధారపడడం సిగ్గుచేటని విమర్శించారు. విచ్చలవిడి మద్యపానం వల్ల యువకులు అనారోగ్యం బారిన పడుతూ ఆర్థికంగా చితికిపోతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్య పానాన్ని అదుపులో పెట్టకపోతే సమాజం నిర్వీర్యమై ప్రశ్నించే తత్వాన్ని కోల్పోతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాబడి కోసం మద్యంపై ఆధారపడకుండా, మద్య పానాన్ని అదుపు చేయాలని డిమాండ్ చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

మానస(ఫైల్)

ఖానాపురం/నల్లబెల్లి, డిసెంబర్ 29: దవాఖానల్లో చికిత్స పొందుతూ జిల్లాకు చెందిన ఇద్దరు ఆదివారం మృతి చెందారు. ఖానాపురం ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన పెంతల అనూష(28), వెంకటేశ్ దంపతులు అప్పు చేసి ఇల్లు నిర్మించుకున్నారు. అప్పులు తీరకపోవడంతో మనస్తాపం చెందిన అనూష ఈ నెల 4న ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే, దుగ్గొండి మండలం బిక్కాజిపల్లికి చెందిన మానసను నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామానికి చెందిన పిండి శ్రీనుకు పదేళ్ల క్రితం ఇచ్చి వివాహం చేశారు. వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. వ్యవసాయంలో పెట్టుబడి రాక, చేసిన అప్పులు తీరక సతమతమవుతున్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన మానస మూడు రోజుల క్రితం వ్యవసాయ బావి వద్ద తన కూతురు సాత్వికకు విషం తాగించి, తానూ తాగింది. సమీప రైతులు గమనించి చికిత్స కోసం హనుమకొండలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మానస మృతి చెందింది. సాత్విక పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజినీర్ చానక్య

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న రాష్ట్ర గృహనిర్మాణ శాఖ చీఫ్ ఇంజినీర్ చానక్య, అధికారులు

వరంగల్, డిసెంబర్ 29: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజినీర్ చానక్య అధికారులను ఆదేశించారు. ఆదివారం గ్రేటర్ పరిధిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాశీబుగ్గ, లష్కర్ సింగారం, బాబు క్యాంప్, కాజీపేట, వెంకటాద్రి నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి, సర్వేను పరిశీలించారు. సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదులో సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే యాప్‌లో సాంకేతిక సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. సర్వే పారదర్శకంగా నిర్వహించి, ఇళ్లు లేని నిరుపేదలను లబ్ధిదారులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, బల్దియా డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, ఆర్‌వోలు శ్రీనివాస్, షహజాదీ బేగం, సరేయర్లు పాల్గొన్నారు.

డాక్టర్ రాజేశ్‌కు 'ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు'

రాజేశ్‌ను సన్మానిస్తున్న ఓసీ సంఘాల ప్రతినిధులు

గిర్నాజీపేట, డిసెంబర్ 29: బ్యాస్ట్ అంకాలాజిస్ట్ అండ్ హెమటాలజిస్ట్ ఇన్ తెలంగాణ విభాగంలో రాష్ట్రం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన డాక్టర్ బొల్లం రాజేశ్ 'ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు'కు ఎంపిక కావడం గర్వకారణమని ఉమ్మడి వరంగల్ జిల్లా ఓసీ సంఘాల ప్రతినిధులు అన్నారు. ఈ నెల 21న గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ చేతుల మీదుగా రాజేశ్ అవార్డు అందున్నందున ఆదివారం ఆయనను ఓసీ సంఘాల ప్రతినిధులు హంటర్‌రోడ్‌లోని ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి, బ్రాహ్మణ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, కమ్మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణప్రసాద్, వైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్‌కుమార్, వెలమ సంఘం రాష్ట్ర నాయకులు కొల్లూరి రాజేశ్వర్‌రావు, ప్రగతిశీల మార్వాడీ సంఘం అధ్యక్షుడు మాదాడి వేణుగోపాల్, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్‌రావు పాల్గొన్నారు.

తుమ్మలకుంటలోని పార్కు స్థలం

ఆ స్థలం పక్కాగా పార్కుదే..!

స్పష్టం చేసిన రెవెన్యూ అధికారులు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 29: వరంగల్ 12వ డివిజన్ తుమ్మలకుంటలోని సర్వే నంబర్లు 411, 422, డీపీ నంబర్లు 89/81లోని 1248 గజాల స్థలం పక్కాగా పార్కుదేనని రెవెన్యూ అధికారులు తేల్చారు. ఈ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మించగా, కలెక్టర్ ఆదేశాలతో వరంగల్ తహసీల్దార్ ఎండీ ఇక్బాల్ సమక్షంలో గ్రేటర్ కార్పొరేషన్ అధికారులు శనివారం కూల్చివేశారు. అనంతరం తహసీల్దార్ ఆదివారం సర్వేయర్‌తో సర్వే చేయించారు. ఈ స్థలం గతంలోనే మున్సిపల్ లేఔట్ ప్లాట్‌గా చేశారని, ఇది పార్కుకు సంబంధించిన స్థలమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ స్థలంలో స్థానికుల కోరిక మేరకు పార్కు నిర్మించాలని మంత్రి కొండా సురేఖను కలిసి విన్నవించనున్నట్లు చేనేత సంఘం నాయకుడు చిప్ప వెంకటేశ్వర్లు తెలిపారు.

గొట్టె వెంకన్నను సన్మానిస్తున్న అల్లం నారాయణ

టీయూడబ్ల్యూజే హెచ్-143 వరంగల్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 29: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హెచ్-143 వరంగల్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మహాసభలో జిల్లా అధ్యక్షుడిగా కోరుకొప్పుల నరేందర్, ప్రధాన కార్యదర్శిగా వాంకిడి శ్రీనివాస్, కోశాధికారిగా రాపెల్లి ఉపేందర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా మిట్ట నవనీత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నీలం శివ, కోశాధికారిగా బైరి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. అలాగే, ఉమ్మడి వరంగల్ జిల్లా ఫ